క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం దోష నివారణ కోసం రాహుకాల పూజలను భక్తులు నిర్వహించారు. దాంతోపాటు వసంత పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చలివేంద్రం ప్రారంభం

కడప అర్బన్: కడప నగరంలోని పాతబస్టాండ్ ఆవరణలో మంగళవారం మేముసైతం సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతినిధులు చలివేంద్రం ప్రారంభించారు. వేసవి కాలం పూర్తయ్యేవరకు చల్లని నీళ్లు, దాతల అభీష్టం మేరకు చల్లని మజ్జిగను ప్రజలకు అందించనున్నారు. కార్యక్రమంలో మేముసైతం సంస్థ ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ కానిస్టేబుల్ రవి, అధ్యక్షుడు వంకధారి రాము, సభ్యులు రెడ్డెయ్య, రాంప్రసాద్, పుట్టా పురుషోత్తం, లేపాక్షి, రామరాజు, దామోదరం సివిల్ సప్లైస్ సురేష్, దుబాయ్ కేఫ్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహం

– వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్



కడప కార్పొరేషన్: విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహం మొదలు కానుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. మంగళవారం వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే పారిశ్రామిక దిగ్గజ కంపెనీలన్నీ ఈ సమ్మిట్‌లో పాల్గొని తమ సంస్థలను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేయడం శుభపరిణామమన్నారు. సమ్మిట్ విజయవంతంగా పూర్తి కావడంతో టీడీపీ నేతల్లో గుబులు మొదలైందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా, సామాజికంగా, పారిశ్రామికంగా, వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందాలంటే ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే సాధ్యమని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్ షఫీ

కడప కార్పొరేషన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గాలకు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెన్నపూస గోపాల్‌రెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిలను గెలిపించాలని డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, 30వ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ కోరారు. మంగళవారం డివిజన్‌లో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం చైతన్య గ్రూప్ ఆఫ్ స్కూళ్లలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మణిశంకర్, మార్కెట్ యార్డు డైరెక్టర్ గోపాలక్రిష్ణ, పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత



కడప కల్చరల్ : కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి మంగళవారం మరికొన్ని పుస్తకాలు చేరాయి. దువ్వూరు మండలానికి చెందిన చల్లబసాయపల్లె గ్రామ వాసి ఎస్ఆర్ ప్రతాప్‌రెడ్డి తన గ్రంథాలయానికి చెందిన 2488 అరుదైన పుస్తకాలను మంగళవారం బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డికి అందజేశారు. పుస్తక దాత ఎస్ఆర్ ప్రతాప్‌రెడ్డిని బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది, వైవీయూ వీసీ అభినందించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

కడప రూరల్ : విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి షేక్ గైబువలీ తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని అభ్యర్థించారు. తాను గెలుపొందాక అటు విద్యారంగం, ఇటు నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

అనుమతులు రాగానే శాశ్వత ప్రాతిపదికన పనులు

కడప సిటీ : బద్వేలు నియోజకవర్గంలోని గోపవరం మండలంలో ఉన్న టి.సండ్రపల్లె చెరువు కట్టకు ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరు కాగానే శాశ్వత ప్రాతిపదికన పనులు చేపడతామని నీటిపారుదలశాఖ ఈఈ తెలిపారు. ఈనెల 6వ తేదిన సాక్షి దినపత్రికలో చెరువు కట్టకు శాశ్వత పనులు చేపట్టాలి అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు స్పందించి వివరణ ఇచ్చారు. ఈ చెరువు పనులకు అంచనాలు రూపొందించి పరిపాలన అనుమతుల కోసం ప్రభుత్వానికి నివేదించామన్నారు. అనుమతులు రాగానే పనులు చేపడతామన్నారు.

మహిళా వందనం

మహిళా దినోత్సవం

• కూలీ బిడ్డ.. ఢిల్లీ గడ్డకు

వైవీయూ: భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కడప నగరానికి చెందిన ఎన్. వందన పాల్గొని జిల్లా ఖ్యాతిని జాతీయస్థాయిలో చాటిచెప్పింది. యోగివేమన విశ్వవిద్యాలయంలో జాతీయ సేవాపథకం ఏర్పాటైన పుష్కర కాలం తర్వాత తొలిసారిగా రిపబ్లిక్ డే పరేడ్ వేడుకల్లో పాల్గొనే అవకాశం ఈమెకు లభించింది. కడప నగరంలో రైల్వేకూలీగా పనిచేసే ఎన్. మోహన్‌రావు, ఎన్. శ్యామల దంపతుల కుమార్తె అయిన ఈమెను పేదరికం వెక్కిరిస్తున్నా.. మొక్కవోని దీక్షతో ఓ వైపు చదువుతూ మరోవైపు జాతీయస్థాయిలో రాణిస్తోంది. కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బయోటెక్నాలజీ చదువుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఎన్. వందన ఈయేడాది జనవరి 26న న్యూఢిల్లీలో నిర్వహించిన రిపబ్లిక్ డే పరేడ్ వేడుకల్లో పాల్గొనింది. వేడుకల అనంతరం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకోవడంతో పాటు వారిచ్చిన విందులో పాల్గొనే అవకాశం ఈమె దక్కించుకుంది.

గవర్నర్, ముఖ్యమంత్రి అభినందన..

ఏపీ నుంచి రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న బృందంలో సభ్యురాలైన వందనను అప్పటి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు అభినందించారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో వందన బృందం (ఇన్‌సెట్) వందన (ఫైల్)

ఉన్నత విద్యావంతులు కావాలి

– వైవీయూ వీసీ ఆచార్య జింకా రంగజనార్దన

వైవీయూ : ప్రతి మహిళా ఉన్నతవిద్యను అభ్యసించి వారికి ఇష్టమైన రంగంలో నైపుణ్యతను సాధించడం ద్వారా మహిళాసాధికారత సాధ్యమవుతుందని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య జింకా రంగ జనార్దన పేర్కొన్నారు. మంగళవారం వైవీయూలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలు మహిళాసాధికారత విభాగం సమన్వయకర్త ఆచార్య పాలెం రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మహిళలు లేనిదే గమనం లేదని, మహిళల గొప్పదనాన్ని వివరించారు. ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ అమ్మను మించిన దైవం మరొకరు లేరన్నారు. వైవీయూ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ఆచార్య పి. పద్మ మాట్లాడుతూ మహిళలు సాధిస్తున్న విజయాలను వివరించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్, ప్రముఖ రచయిత్రి జూపాక సుభద్ర మాట్లాడుతూ సమాజంలో మహిళలను గౌరవించినప్పుడే అసలైన అంతర్జాతీయ మహిళా దినోత్సవం అవుతుందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన సిబ్బందికి అమెరికన్ తెలుగు అసోసియేషన్ భారతీయ సమన్వయకర్త జి. సూర్యచంద్రారెడ్డి నిధులు అందజేయగా, అతిథులు చేతుల మీదుగా బహుమతులు విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో ఉమన్‌సెల్ సమన్వయకర్త ఆచార్య పి. రమాదేవి, సహ సమన్వయకర్తలు డా. జి. కాత్యాయని, డా. ప్రమీలామార్గరేట్, డా. ఎల్. దాక్షాయణి, కె. వేణిసుజాత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ ఆచార్య జింకా రంగజనార్ధన

మహిళాశక్తి ముందు అన్ని శక్తులు దిగదుడుపే

– వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య బానోతు అంజనేయ ప్రసాద్

ఏఎఫ్‌యూ : మహిళల శక్తి ముందు మరేశక్తి అయినా దిగదుడుపేనని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు అంజనేయప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మహిళలను గౌరవించడం మన సంప్రదాయమని, కుటుంబంలో ప్రేమ, బాంధవ్యాలు పెంపొందించడంలోను, మెరుగైన సమాజం సృష్టించడంలో మహిళల సేవ ఎనలేనిదన్నారు. ప్రతి పురుషుడు తమ కుటుంబంలోని ఆడవాళ్లకు ప్రాముఖ్యత, వారి మాటకు విలువ ఇచ్చినప్పుడు ఆ సమాజంలో వారికి దక్కాల్సిన గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. పలువురు అధ్యాపకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ పవన్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మహిళా అధ్యాపకులతో వీసీ ఆచార్య బానోతు అంజనేయ ప్రసాద్

అన్ని రంగాల్లో రాణించాలి

కడప ఎడ్యుకేషన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జ్యోతి నర్సింగ్‌హోమ్ వైద్యురాలు డాక్టర్ జ్యోతి అన్నారు. మంగళవారం కడప నగర శివార్లలోని శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాజు, సియస్‌సి హెచ్‌ఓడీ ఛరీస్మా, అన్ని విభాగాల మహిళా అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా సాధికారత అధికారి ఎంఎస్ రాణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయ రామరాజుతోపాటు ఇతర అధికారులు వేడుకల్లో పాల్గొని విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులను సత్కరిస్తారన్నారు.

కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: ఈ నెల 15వ తేదీ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యే నేపథ్యంలో విద్యార్థులకు పూర్తి ఫీజు చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామని హుకుం జారీ చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం కడప బాలాజీనగర్‌లోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

వెన్నపూసను గెలిపించాలి

కడప కార్పొరేషన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ కోరారు. మంగళవారం చిన్నచౌకు, బుడ్డాయపల్లెలో ఆయన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

వాహనదారులపై 291 కేసులు

కడప అర్బన్: జిల్లా వ్యాప్తంగా వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం మొత్తం 291 కేసులను నమోదు చేశారు. ఇందులో హెల్మెట్ లేని ద్విచక్రవాహనదారులకు 245 కేసులు, సీటుబెల్ట్ ధరించని వారిపై 46 కేసులను నమోదు చేశారు.

మట్కా బీటర్ అరెస్ట్

కడప నగరంలోని సంఘంపేటలో పఠాన్ మహబూబ్ ఆలీఖాన్ అనే మట్కాబీటర్‌ను ఎస్ఐ జయరాముడు అరెస్ట్ చేశారు.

సమాజంలో స్త్రీ పాత్ర అమూల్యమైనది



మహిళా అధ్యాపకులతో జడ్జి కవిత

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ముందస్తు వేడుకలు నిర్వహించారు. మంగళవారం కళాశాల మహిళాసాధికారత కోఆర్డినేటర్ డాక్టర్ యు. రమ్యజ్యోతి అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జడ్జి మాట్లాడుతూ మానవ జీవితంలో, సమాజంలో మహిళల పాత్ర ఎంతో అమూల్యమైనదన్నారు. ప్రస్తుతం మహిళలు కుటుంబం నుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో రాణిస్తుండటం శుభపరిణామమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ మహిళలు అడుగుపెట్టని రంగం అంటూ ఏదీ లేదని పేర్కొన్నారు. ఉమన్ ఎంపవర్‌మెంట్ కోఆర్డినేటర్ డా. యు. రమ్యజ్యోతి మాట్లాడుతూ ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుందన్న గురజాడ మాటల్ని గుర్తుచేశారు. అనంతరం వివిధ రంగాల్లో రాణించిన మహిళా అధ్యాపకులను, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, అధ్యాపకులు డా సావిత్రి, శివపార్వతి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సుబ్బలక్షుమ్మ మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులను సమానదృష్టితో చూడాలని, పిల్లలను సైతం సమానంగా పెంచాలని కోరారు. ఈ సందర్భంగా రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొన్న కళాశాల విద్యార్థిని వందనను, నీసా మహిళా శాస్త్రవేత్త అవార్డు అందుకున్న డా. పి. శచీదేవిని, జూనియర్ అసిస్టెంట్ భారతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ డా. జి. విజయలక్ష్మిదేవి, మహిళా సాధికారత కమిటీ కన్వీనర్ నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

కడప రూరల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా జియోన్ కళాశాల మైదానంలో జరుగుతున్న మహిళా ఉద్యోగుల ఆటల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రెండవరోజు మంగళవారం మహిళా ఉద్యోగినిలు జావెలిన్ స్టిక్, డిస్కస్ త్రో, లెమన్ స్పూన్, త్రోబాల్ తదితర పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసంతోపాటు మెరుగైన ఆరోగ్యాన్ని చేకూరుస్తాయన్నారు. బుధవారం కూడా ఆటల పోటీలు ఉంటాయని, ఈ పోటీల్లో అన్నిశాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం చైర్మన్ శాంతమ్మ, కన్వీనర్ భారతి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మలా జ్యోతి, అసోసియేషన్ నాయకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలలో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎస్‌బీసీసీ జిల్లా కో ఆర్డినేటర్ కెతుర, డీబీఎస్ఐ స్టేట్ ప్రోగామ్ మేనేజర్ కుమారి తెలిపారు. మంగళవారం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో డెట్టాల్ బనేగా స్వస్థ్ ఇండియా వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హ్యాండ్‌వాష్, ఆరోగ్యం వంటి అంశాలపై రంగోలి పోటీ నిర్వహించారు. వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినిలకు అతిథులు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, డీబీఎస్ఐ జిల్లా ప్రోగామ్ మేనేజర్ విష్ణువర్దన్, ఉపాధ్యాయులు రుక్మిణి, భారతి, రెడ్డెమ్మ, రహమతున్నీసా పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

కడప కోటిరెడ్డిసర్కిల్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కడప తహసీల్దార్ శివరామిరెడ్డి తెలిపారు. మంగళవారం అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు కడప ఆర్డీఓ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కడప నగరంలో 26 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామని, 47 మంది సూపర్‌వైజర్లను నియమించామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. బ్యాలెట్ పేపర్లను ఎలా ఉపయోగించాలి? ఎలా ఓటు వేయాలో, ఓటు వేసే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తదితర విషయాలను తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎలెక్షన్ డీటీ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శివరామిరెడ్డి

వైద్య వృత్తి గౌరవాన్ని ఇనుమడింపచేయాలి

– ఏపీఎంసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎస్.వి.కే ప్రసాద్ రెడ్డి

కడప అర్బన్: వైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసించి హౌస్‌సర్జన్‌లుగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ వైద్య వృత్తి గౌరవాన్ని ఇనుమడింపచేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ ఎస్.వి.కే ప్రసాద్‌రెడ్డి అన్నారు. కడపలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జూనియర్ వైద్యులైన హౌస్ సర్జన్‌లకు వైద్య నీతి ప్రమాణాల అవగాహన కార్యక్రమం మంగళవారం కళాశాలలోని మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.వి.కే ప్రసాదరెడ్డి మాట్లాడుతూ కడపలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్యను పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ సమాజంలోని ప్రజలకు వైద్య సేవలను అంకితభావంతో అందించాలన్నారు. అపుడే మీరు విద్యను అభ్యసించిన వైద్య కళాశాలకు, తల్లిదండ్రులకు పేరుప్రతిష్టలు తీసుకునివచ్చిన వారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో కడప ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, ప్రభుత్వ సర్వజనా సుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వర రావు, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సందిపోగు లక్ష్మీబాయి మాట్లాడారు. అనస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ ఏ. సునీల్, ఎస్‌పిఎం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్‌రెడ్డి, ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్‌వికే ప్రసాద్‌రెడ్డి